క్లుప్తంగా

ఓటరు జాబితా అత్యంత కీలకం



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తదితరులు

రాజానగరం: ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, దానిని హేతుబద్ధంగా తయారుచేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. జాతీయ రహదారిపై దివాన్ చెరువు కూడలిలో మంగళవారం ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి ఒకటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందవచ్చన్నారు. అనంతరం ఓటు హక్కును సక్రమంగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉపయోగిస్తానంటూ ప్రతిజ్ఞ చేశారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఓటు హక్కును ప్రాధాన్యతను వివరిస్తూ చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, ఆర్డీఓలు చైత్రవర్షిణి, ఎస్.మల్లిబాబు, తహసీల్దార్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

రహదారికి రూ.45 లక్షల మంజూరు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో మెయిన్ రోడ్డు నిర్మాణం కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రూ.45 లక్షలు మంజూరయ్యాయని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సదరు నిధులతో కొంకుదురు వంతెన నుంచి సత్తి వెంకట్రాయుడు ఇంటి వరకూ ప్రధాన రహదారిని విస్తరించి సీసీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో ఈ రహదారి నిర్మాణం వల్ల అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, స్పీకర్ ఓఎస్డీ పడాల సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ సత్తి వీరమణిలకు గ్రామస్తుల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా సాయిబాబా జప యజ్ఞం

మధురపూడి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని బూరుగుపూడిలోని సాయిబాబా ఆలయంలో మంగళవారం ఓం శ్రీ సాయిరామ్ జపయజ్ఞం ప్రారంభమైంది. నెలరోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ 24 గంటలూ జపయజ్ఞం చేశారు. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు ఆధ్వర్యంలో రాత్రి వేళల్లో దీపాలంకరణ ఆకట్టుకుంది. ఆలయ కమిటీ అధ్యక్షులు కంటే నాగ కేశవరావు, కంటే సత్యచక్ర గణపతి, గూడపర్తి వెంకటేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎండీయూ ఆపరేటర్‌పై 6ఏ కేసు

మధురపూడి: గోకవరం మండలం తంటికొండకు చెందిన ఎండీయూ ఆపరేటర్ మారిశెట్టి స్వామి వీరదుర్గపై 6ఏ కేసు నమోదు చేసినట్టు సీతానగరం ఎంఎస్ఓ డి.అచ్యుత కుమారి మంగళవారం తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ పురుషోత్తపట్నం నుంచి సీతానగరం వస్తున్న ఎండీయూ ప్రభుత్వ వాహనాన్ని స్థానిక ఎస్సై చిరంజీవి స్వాధీనం చేసుకుని తనకు అప్పగించారన్నారు. ఆపరేటర్ దుర్గను విచారించగా స్నేహితుడి బంధువులకు ఆరోగ్యం బాగా లేనందున వాహనంతో వచ్చానని, తిరిగి వెళ్తుండగా ఎస్సై పట్టుకున్నారని తెలిపారన్నారు. వాహనాన్ని పరిశీలించగా 1,100 కేజీల బియ్యం, 30 కేజీల గోధుమపిండి, 40 కేజీల పంచదార 40 ఉందని, దీంతో వాహనం ఆపరేటర్‌పై 6 ఏ కేసు నమోదు చేశామన్నారు. సరుకులను కోరుకొండలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామన్నారు.

త్వరలో షాదీఖానా నిర్మాణం



ఇనుగంటివారిపేటలో మాట్లాడుతున్న ఆరిఫ్

మధురపూడి: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మంజూరు చేసిన రూ. 70 లక్షల నిధులతో సీతానగరం మండలం ఇనుగంటివారిపేటలో త్వరలో షాదీఖానా నిర్మాణం ప్రారంభించనున్నట్టు వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్ తెలిపారు. మంగళవారం ఆ గ్రామానికి వచ్చిన ఆయన స్థానిక ముస్లిం పెద్దలతో కొద్దిసేపు చర్చించారు. నిర్మాణ ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పేట సర్పంచ్ సత్యం రాంపండు, మసీదు అధ్యక్షుడు షేక్ షరీఫ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మీరా పాల్గొన్నారు.

బంగారు తల్లులు కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలి

రంగంపేట: బంగారు తల్లుల కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి సూచించారు. మండల కేంద్రమైన రంగంపేట పీహెచ్‌సీ వద్ద మంగళవారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్స్‌తో కలిపి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కె. జయమణి, ఎంపీహెచ్ఈఓ పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల చదువుకు అండగా సీఎం జగన్

- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఘనంగా బాలల దినోత్సవం



బొబ్బిల్లంక హైస్కూల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సీతానగరం మండలం బొబ్బిల్లంక హైస్కూల్లో మంగళవారం జరిగిన బాలల దినోత్సవాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, గుణాత్మక అభివృద్ధికి బాటలు వేశారన్నారు. తొలుత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు చిన్ని, ఉప సర్పంచ్ కోమలి వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిన చౌదరి, సీతానగరం ఎంఈఓ స్వామినాయక్ పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు

మధురపూడి: నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని కోరుకొండ ఎంఈఓ టి.కుశలవ దొర అన్నారు. దోసకాయలపల్లి హైస్కూల్లో జరిగిన బాలల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, జీవించే హక్కులో భాగంగా ప్రభుత్వం అమలు జరుపుతున్న అన్ని సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్ అధ్యక్షతన ఈ సభ జరిగింది. నెక్కంటి సీ ఫుడ్స్ సంస్థ అధినేత నెక్కంటి సీతారామయ్య విద్యార్థులకు విందు ఏర్పాటు చేశారు. వంద మంది విద్యార్థులకు దాతల ద్వారా రూ.30,000, మెరిట్ విద్యార్థులకు మెమెంటోలు అందించారు. మండలంలోని 55 ప్రభుత్వ పాఠశాలల్లో ఆటపాటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బీవీబీలో బాలల దినోత్సవం

రాజానగరం: నామవరంలోని భారతీయ విద్యా భవన్‌లో మంగళవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఓఎన్‌జీసీ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా అవినీతి నిర్మూలనపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, ధృవీకరణ పత్రాలు అందజేశారు.

- లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని గౌతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలోని సౌజన్య మనోవికాస కేంద్రంలోను బాలల దినోత్సవం నిర్వహించారు. బొమ్మూరు నేతాజీ నగర్‌కి చెందిన శ్రీసాయి సమాఖ్య, మంజు ఫ్రెండ్స్ అండ్ రిలేషన్స్ ద్వారా సౌజన్య మనోవికాస కేంద్రంలో బాలలకు రూ. 35 వేలు విలువ చేసే వాషింగ్ మెషీన్, నెలవారీ వెచ్చాలు సమకూర్చారు. అలాగే భోజన సదుపాయం కల్పించారు.

పెదపూడి: విద్యార్థుల సంక్షేమానికి, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, హెచ్ఎం కె.శ్రీనివాసు, వైఎస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత జవహర్‌లాల్ నెహ్రూ

అనపర్తి: స్వాతంత్ర్యానంతరం భారత దేశ అభివృద్ధికి బాటలు వేసిన భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ నవ భారత నిర్మాతగా, స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని ఎంఈఓ బి.పుష్పలత అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓతో పాటు ఎంఈఓ-2 నల్లమిల్లి సత్తిరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాచా నెహ్రూకు పిల్లలపై వుండే మమకారానికి చిహ్నంగా ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులుక చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ పాఠశాల ఆవరణలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వర్‌రెడ్డి, శ్రీకృష్ణ సాయి తదితరులు పాల్గొన్నారు. ఇలపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ..

గోకవరం: భూపతిపాలెం గురుకుల పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ బేతపూడి రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు నగదు పురస్కారం, ప్రశంశా పత్రాలు, మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎం.రత్నకుమార్, ట్రెజరర్ ఎస్.అచ్చిరెడ్డి, ఫౌండర్ వర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణ పరమహంస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దోసకాయలపల్లి హైస్కూల్లో విద్యార్థులకు బహుమతులందిస్తున్న ఎంఈఓ కుశలవ దొర



జి.మామిడాడలో విద్యార్థికి మెడల్ అందజేస్తున్న ఎంపీపీ తులసి



అనపర్తిలో బాలల దినోత్సవ వేడుకల్లో జాతీయ నాయకుల వేషధారణలతో విద్యార్థులు

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



వెంకటరామారెడ్డికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామానికి చెందిన మల్లిడి వెంకట రామారెడ్డి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1,75,000 చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలో 9 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.9.20 లక్షలు విలువ గల చెక్కులను స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో అనపర్తి, కొప్పవరం సర్పంచ్‌లు వారా కుమారి, కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ సత్తి నాగిరెడ్డి, కొప్పవరం మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, పాలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



పెదపూడిలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేదరికమే ప్రామాణికంగా కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే తామంత జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గా ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కాకార సాయిబాబు, కోరా బాబీ, మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, సొసైటీ డైరెక్టర్ పందిరి సూర్యప్రకాశ్, మండల చేనేత విభాగం కన్వీనర్ తిప్పాన వెంకటరమణ, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- మునికూడలిలో గడప గడపకూ..



మునికూడలిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల ఇంటి వెలుగులు నిండాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా.. ఇంటింటికీ వెళ్లి అందర్నీ పలకరిస్తూ, సంక్షేమ పథకాలందుతున్న తీరుపై ఆరా తీశారు. స్థానికులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి రూ.6.50 కోట్లు నిధులు కేటాయించినట్టు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల కొనుగోలు శక్తిని పెంచుతున్న ఏకైక ప్రజా ప్రభుత్వమిదే అన్నారు. గ్రామంలో రూ.11,48,000తో సంక్షేమ పథకాలను 4,377 మంది లబ్ధిదారులకు అందించినట్టు తెలిపారు. రూ.53 లక్షలతో గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కేవలం రూ.57 లక్షలు మాత్రమే కేటాయించిందన్నారు. రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గుత్రాల జోత్స్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి హరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాబు, మునికూడలి ఎంపీటీసీ సభ్యురాలు నూతంగి ధనలక్ష్మి, నాయకులు కవల దుర్గం, అంబటి రాజు, కవల విష్ణుమూర్తి, నూతంగి నాగన్నదొర, కొల్లి చిరంజీవి, ఏకా రాజు పాల్గొన్నారు.

మళ్లీ జగనే రావాలన్నది ప్రజలందరి ఆకాంక్ష



పెద్దాడలో సంక్షేమ పథకాల వివరాలు తెలిపే ప్రదర్శన బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదపూడి: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించి తమ జీవితాల్లో వెలుగులు నింపుతున్న జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నది ప్రజలందరి ఆకాంక్ష అని ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. పెద్దాడ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నోడల్ ఆఫీసర్ ఎం.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏ పథకాలతో ఎంతమంది లబ్ధి పొందారో వివరాలు తెలియజేసే సంక్షేమ అభివృద్ధి పథకాల బోర్డును సచివాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డోకుబుర్ర మీనాక్షి, ఎంపీటీసీ సభ్యురాలు యాళ్ల మాధవి, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, పాలచర్ల రామకృష్ణ చౌదరి, సచివాలయ కార్యదర్శి ఎం.త్రినాథ్ పాల్గొన్నారు.

గంగంపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్

గోకవరం: గంగంపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న పథకాల బోర్డును ఆవిష్కరించారు. స్థానిక నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సీత దుర్గబాబు, ఎంపీడీఓ పద్మాజ్యోతి, ఏఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, కార్యదర్శి గోవిందు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంగంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వై ఏపీ నీడ్స్ జగన్ ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని రంగంపేటలోని స్థానిక సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అందిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా జరిగిన లబ్ధిని వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే బోర్డును జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలన్నా మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని జెసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు అన్నారు. మంగళవారం బిక్కవోలు సచివాలయం-1 వద్ద నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సరెళ్ళ సుమలత, పోతల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రంగంపేట సచివాలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు


సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కడదాం

అనపర్తి: ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో మళ్లీ పట్టం కడదామని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని దుప్పలపూడిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమని అన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండా ప్రేమలత, చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంభో.. శివ శంభో..



అనపర్తి మార్కండేయపురంలో ముక్కంటికి అభిషేకం చేస్తున్న అర్చకులు



బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ముక్కంటి క్షేత్రాలకు కార్తిక శోభ

అనపర్తి: కార్తిక మాసం ప్రారంభం సందర్భంగా మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే భక్తులు సమీపంలోని కాలువలు, గోదావరి నదీజలాల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. మండలంలోని దుప్పలపూడి పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి, పెదపర్తిలోని పార్వతీ సమేత ఉమా రామలింగేశ్వర స్వామి, రామవరంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. పొలమూరులో రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి వారి ఆలయంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్తిక పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని కార్తిక దామోదరునికి పూజలు జరిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కార్తిక మాసం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శనానికి బారులు తీరారు. అనంతరం భక్తుల కోసం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

సహకార జెండా ఆవిష్కరణ



బూరుగుపూడిలో జెండా ఆవిష్కరిస్తున్న డివిజనల్ సహకార అధికారి ఉమా పార్వతి

మధురపూడి: సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలని రాజమహేంద్రవరం డివిజనల్ సహకార అధికారి ఉమాపార్వతి అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి సొసైటీ కార్యాలయానికి వచ్చిన ఆమె మంగళవారం వారోత్సవాల్లో భాగంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకూ వారోత్సవాలు జరుగుతాయన్నారు. బూరుగుపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుద్దిగ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామదాసు కో ఆపరేటివ్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీఏసీఎస్ పర్సన్లు అడపా వెంకట రామకృష్ణ, ఈర్ల గంగేశ్వరుడు, సీఈఓ ఈదల సుదర్శనరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధుమేహం రాకుండా జాగ్రత్తలు తీసుకోండి



లాలాచెరువులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పద్మలత

రాజానగరం: మధుమేహం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పద్మలత అనుసూరి సూచించారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆమె వైద్య సేవలు అందించారు. దేశంలో సుమారు 10 కోట్ల మంది మధుమేహం బాధితులున్నారన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు గోదావరి జిల్లాలో కూడా వీరి సంఖ్య అధికంగానే ఉందన్నారు. మధుమేహం రాకుండా ప్రతిరోజు కనీసం ఒక గంట సమయం వాకింగ్, వ్యాయామం చేయడం మంచిదని సూచించారు. నిరంతరం ప్రజల యోగ క్షేమాల కోసం ఆరాటపడుతున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

593 మందికి వైద్య పరీక్షలు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 593 మందికి వైద్య పరీక్షలు జరిగాయి. వీటిలో 191 కంటి వైద్య పరీక్షలు ఉన్నాయి. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీ, వైఎస్సార్ సీపీ నాయకులు మెట్ట ఏసుపాదం, కడలి భాస్కరరావు, గువ్వల వెంకటేశ్వర్రావు, చింతపల్లి శ్రీనివాస్, ఆచంట గురునాథ్, పడాల వెంకటేశ్వర్రావు పాల్గొన్నారు.

జీఎస్ఎల్ వైద్య కళాశాలలో..

రాజానగరం: ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్కే మిశ్రా పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించారు. వైద్య విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, పేపర్ ప్రెజంటేషన్లు నిర్వహించారు. తొలుత కళాశాల క్యాంపస్‌లో ర్యాలీ నిర్వహించి, మధుమేహంపై చైతన్య కార్యక్రమాలు చేపట్టారు.

గ్రంథాలయాలు మార్గదర్శకాలు

రంగంపేట: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గ్రంథాలయాలు మార్గదర్శకాలని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనమే ఏకైక సాధమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు మేడిశెట్టి రవిశంకర్ పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు శాఖా గ్రంథాలయం వద్ద గ్రంథాలయ వారోత్సవాలను సర్పంచ్ సత్తి వీరమణి ప్రారంభించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాయలంలో తీసుకొచ్చిన డిజిటల్ విధానాన్ని విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తినాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, గ్రంథాలయ శాఖాధికారి నందికోళ్ళ బాలు, హెచ్ఎం ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజానగరంలో..

రాజానగరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం మంగళవారం జరిగాయి. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, సర్పంచ్ కుండేటి ప్రసాద్, ఉపసర్పంచ్ కొల్లి వీర్రాజు, హెచ్ఎం పివివి భీమేశ్వర్రావు, లైబ్రేరియన్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.